ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 02 సంచిక -333 పేజీలు - 8 వెల - 03/- శనివారం 21 మార్చి 2026

# సిలిండర్ల సరఫరాకు అంతరాయమొద్దు

అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై సీఎం సమీక్ష



- పంట నష్టంపై రెండు రోజుల్లో నివేదిక
- ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**అమరావతి, మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** అకాల వర్షాలు, భారీ గాలులు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రాకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా అంచనా వేశారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా ప్రభావం చూపాయని తెలిపారు. అరటి, బొప్పాయి, **మిగతా 2లో...**

# పిరికివాళ్లు

## : నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక

**న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు. **మిగతా 2లో...**



# కనిపించిన నెలవంక..

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు -నేడు పవిత్ర రంజాన్ పండగ

**న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు.



# ఐఏఎస్‌ల బదిలీలు..

## సీఆర్‌డీఏకి కొత్త కమిషనర్



- పౌర సరఫరాల శాఖకు బదిలీ అయిన కన్నబాబు
- మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు రవి సుభాష్‌కు అప్పగింత

**అమరావతి, మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగంలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల్లో భాగంగా, అత్యంత కీలకమైన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నూతన కమిషనర్‌గా విజయరామరాజును నియమించింది. **మిగతా 2లో...**

# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

- : సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య



2లో.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లాలో విషాదం
- గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు
- నీటిలో కొట్టుకుపోయిన ఐదుగురు విద్యార్థులు...
- మరో ఇద్దరు ఒడ్డుకు చేరిన వైనం
- ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాల వెలికితీత
- మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు



2లో.

# ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం

- జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడుద
- : వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన
- వైఎస్ కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన విజయమ్మ
- ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల
- షర్మిలకు రాసిన ఆస్తులు న్యాయంగా ఆమెకు చెందినవేనని వెల్లడి
- వైఎస్సార్ ఆదేశానుసారం ఆస్తులు నలుగురు మనుమలకు పంచాలని వివరణ



2లో.

# 3,24,234 కోట్లు

## శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు
- మూలధన వ్యయం రూ.47,267 కోట్లు
- మండలిలో పద్దును ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్
- జూన్2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- 'చేయూత'తో 2 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం
- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం
- గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- ఉభయసభలు సోమవారానికి వాయిదా

**హైదరాబాద్ మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లుగా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపెట్టారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున జీవిత బీమా అందించేలా ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. చేయూత పథకం ద్వారా అర్హులైన 2 లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు **మిగతా 2లో...**



# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

## : సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :**
అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

### కేసు నేపథ్యం ఏమిటంటే..

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

### సుప్రీంకోర్టు ఏమంది?

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృథా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.
అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# ఏపీలో ఐఏఎస్‌ల బదిలీలు..

**మొదటి పేజీ తరువాయి**
ఇప్పటివరకు సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కె. కన్నబాబును పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయరామరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీ అమరావతి అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.
ఇదే సమయంలో మరికొన్ని ముఖ్యమైన నియామకాలు కూడా జరిగాయి. మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా విజయ సునీతను, పోలవరం జిల్లా కలెక్టర్‌గా దినేశ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా ఉన్న సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. అలాగే, రవి సుభాష్‌కు వ్యవసాయం, మార్కెటింగ్ శాఖల పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బదిలీలు పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలుగా భావిస్తున్నారు.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

పోలవరం,**మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.
పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు.సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# సిలిండర్ల సరఫరాకు అంతరాయమొద్దు

**మొదటి పేజీ తరువాయి**
మిర్చి, మామిడి, నిమ్మ, బత్తాయి, కూరగాయల పంటలు దెబ్బతినగా, రూ.23కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మొత్తం నష్టం రూ.63కోట్లుగా అంచనా వేశారు. దీనిపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. యుద్ధం కొనసాగితే.. ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, అన్నక్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తద్వారా పంట నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, పంట నష్టం జరిగినప్పుడు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలకు జరిగిన నష్టంపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. ఇప్పటి వరకు గాలివానలు, వర్షాలు, వడగళ్ల కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా, నెల్లూరు, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, మన్యం జిల్లాల్లోని 16 మండలాల్లో 89 గ్రామాల్లో వర్షాలతో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అధికారులు సీఎంకు వివరించారు. 384 హెక్టార్లలో వరి, 630 హెక్టార్లలో మొక్కజొన్న, 200 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మొత్తం 1,215 హెక్టార్లలో సాధారణ పంటలు దెబ్బతినగా, 2,043 మంది రైతులు నష్టపోయినట్లు చెప్పారు. అలాగే అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్
జిల్లాల్లోని ఉద్యాన పంటలపైనా అకాల వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు.
-----------

# ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం

**అమరావతి, మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్వయంగా స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.
"2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే (ఞశీఎఎఱఅవస ఝఎఱశ్రీఎ ఖంంవ్ం). ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది.
ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా ఎంవోయూలో లేని యెలహంక


Phone No:
Sold To/Issued To:
Y. Vijaya
For Whom/ID Proof:
Self

భారత INDIA
INDIA NON JUDICIAL

₹ 0000020/-
ZERO ZERO ZERO ZERO TWO ZERO

MAR-20-2026 11:32:20

20/3/2026

**Clarification:**

2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే ( combined family assets). ఆస్తుల పంపకం ఎప్పుడు జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశ్యం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది.

MOUలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ MOU రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా MOUలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.

ఆస్తుల పంపకం జరగ లేదు. ఇప్పుడు చదువుతున్న షర్మిల ఆస్తుల లాంటివి వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు ? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా.

దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే.

ఇట్లు, Y.S Vijayamma
వైఎస్ విజయ రాజశేఖర రెడ్డి.

ATTESTED
J. Chiranjeevi Babu
B.Com, LLB
ADVOCATE & NOTARY
#127/128/C, Sri Krishna Nagar
Near Sai Kiran Public School,
Yousufguda, Hyderabad-500 045
Ph: 9848436173 7981845138

20 MAR 2026

ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.



ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ గారు జగన్ కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా.
దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.

# కనిపించిన నెలవంక..

**మొదటి పేజీ తరువాయి**
పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనిపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

# పిరికివాళ్లు

**మొదటి పేజీ తరువాయి**
"అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు. కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హార్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హార్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

## ఏపీ మద్యం కేసు.. ముప్పిడి అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

**అమరావతి, మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్ లో ఉన్న ఆయనను ఇప్పటికే సిట్ మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఈ విచారణలో ఆయన పలు విషయాలను వెల్లడించినట్లు సమాచారం.
ఈ కేసులో ముప్పిడి అవినాశ్ రెడ్డి నగదు బదిలీలు, ఆర్థిక నియంత్రణలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అవినాశ్ రెడ్డి జైలు నుంచి బయటకు రానున్నారు. మరోవైపు, మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, సిండికేట్ల ఏర్పాటు వెనుక ఉన్న అసలు శక్తులను బయటకు తీసేందుకు సిట్ తన విచారణను మరింత వేగవంతం చేసింది.

# 3,24,234 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**
చదివే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా పోషకాలతో కూడిన రాగిజావ, పాలు అందిస్తామని చెప్పారు.
ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్టు ప్రకటించారు. ఇంటర్ చదివే వికలాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో వంటశాలలను ఆధునీకరించేందుకు రూ.100 కోట్లు కేటాయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1000 కోట్లు, వీరనారి చిట్యాల ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ.400 కోట్లు, మిగతా యూనివర్సిటీలకు కూడా బడ్జెట్‌లో కొంతమేర కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మండలిలో పౌరసంబంధాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రతిపాదించారు.
అనంతరం ఉభయ సభలు సోమవారం ఉదయం 10 గంటలకు వాయిదా పడ్డాయి. శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్‌పై ప్రసంగిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నామనీ, ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిపోయిందనీ, ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వం పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే ఆర్థిక క్రమశిక్షణతో పాలనను గాడిన పెడుతున్న తీరును వివరించారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమనీ, సుస్థిరమైన అభివృద్ధి వైపునకు నడిపించేలా బడ్జెట్ రూపొందించామని తెలిపారు.

### తెలంగాణ వృద్ధిరేటు 10.7 శాతం

2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం రూ.17, 82,198 కోట్లు అనీ, వృద్ధిరేటు 10.7 శాతంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.3,57,13,886 కోట్లుగా ఉండగా వృద్ధిరేటు 8 శాతంగానే ఉందని చెప్పారు. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ 5 శాతం వాటా కలిగి దేశానికి బలమైన అభివృద్ధి యంత్రంలా ఉందన్నారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.8 శాతం ఉండగా 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయిందనీ, అదే సందర్భంలో 2024-25లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 10.6 శాతం ఉండగా ఈ ఏడాది 10.7 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం రూ.4,18,931గా ఉందనీ, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే 1.9 రెట్లు ఎక్కువ అని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

### సీఎస్ఎస్ నిధులపై దృష్టి

గత ప్రభుత్వం 2014 నుంచి 2023వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) నిధులను రాబట్టడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం భట్టి విమర్శించారు. తమ ప్రభుత్వం 2014-15 నుంచి 2023-24 వరకు సీఎస్ఎస్ కింద బకాయిపడ్డ రూ.3 వేల కోట్లను విడుదల చేసిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.7,072 కోట్లను రాబట్టామని చెప్పారు. మరింత చిత్తశుద్ధితో అధిక



నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

### రుణ పునర్వ్యవస్థీకరణతో నగదు వెసులుబాటు

గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించామనీ, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20 ఏండ్ల నుంచి 39 ఏండ్లకు పొడిగించడంలో సక్సెస్ అయ్యామని భట్టి తెలిపారు. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుంచి 2031-32 దాకా చెల్లించాల్సిన రూ.34,058 కోట్ల భారం కాస్తా రూ.11,915 కోట్లకు తగ్గిందని తెలిపారు. దాని ద్వారా రాష్ట్రానికి రూ.22, 142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగిందని చెప్పారు. ఈ ఏడాది రూ.27,988 కోట్ల అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చుకున్నామని తెలిపారు.

### రూపాయి పంపితే కేంద్రం ఇచ్చేది 42 పైసలే

కేంద్రానికి తెలంగాణ నుంచి రూపాయి పంపితే తిరిగి 42 పైసలే మనకు దక్కుతున్నదని భట్టి వివరించారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, సొంత రాబడి పెంచుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రాష్ట్రాలకు ఈ పంపకం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని 16వ ఆర్థిక సంఘం ముందు ఎత్తిచూపామన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీని కూడా కొలమానంగా తీసుకునేలా ఒప్పించామనీ, తెలంగాణ వాటాను 2.102 శాతం నుంచి 2.174 శాతానికి పెంచుకోవడంలో కొంతమేర సక్సెస్ అయ్యామని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ రైజింగ్ విజన్ -2047గ్లోబల్ సమ్మిట్ ఆధారంగానే తెలంగాణ రైజింగ్ విజన్-2047ని విడుదల చేశామని డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారు. ఆ సమ్మిట్‌లో వందకుపైగా ఎంఓయూలు జరిగాయనీ, వాటి ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ లో 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' ను ఆవిష్కరించారనీ, 2030 నాటికి పరిశోధనాభివృద్ధి, ఆధునిక తయారీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలపాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆ రంగంలో ఇప్పటిదాకా రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 2.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. రానున్నకాలంలో సింగపూర్‌కు చెందిన ఏజీఐడీసీ, వియత్నాంకు చెందిన విన్ గ్రూప్, జేసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల నుంచి 1,03, 500 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్యూర్..ప్యూర్..రేర్

తెలంగాణను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించామని భట్టి తెలిపారు. క్యూర్‌లో సేవారంగానికి, ప్యూర్‌లో ఉత్పాదక రంగానికి, రేర్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి అన్నారు. 30 వేల ఎకరాల్లో భూగర్భవిద్యుత్, పర్యావరణ అనుకూల స్మార్ట్ గ్రిడ్లతో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామనీ, దాన్ని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా 3.76 లక్షల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశామని ప్రకటించారు. జనగణనను డిజిటల్ విధానంలో చేయ బోతున్నామని తెలిపారు.
ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రూ. 9,222 కోట్లు ఆదా చేసుకున్నారనీ, రూ.500కే గ్యాస్‌సిలిండ్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు రూ.752 కోట్లు, ఉచిత కరెంటు ద్వారా పేదలకు రూ. 3,954 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. మహిళా శక్తి మిషన్ ద్వారా మహిళలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలు ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఇప్పటికే 57, 938 కోట్ల రూపాయల రుణం ఇప్పించామని తెలిపారు. 1,329 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని చెప్పారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకం కింద ఎస్టీలకు 12,600 కోట్ల బడ్జెట్‌తో వంద శాతం సబ్సిడీ కింద సోలార్ పంపు సెట్లను అందిస్తామనీ, 6 లక్షల ఎకరాల పోడు భూములలో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామనీ, విధివిధానాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు.

# అభాగ్యుడిని ఆదుకోండి..

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న కోసువారిపల్లి యువకుడు..

### కాలేయ వ్యాధితో బాధపడుతూ భతుకీడుస్తున్న అభాగ్యుడు..

**అన్నమయ్య బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -** తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని స్థానిక మండల కేంద్రమైన కోసువారి పల్లి గ్రామానికి చెందిన రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబానికి చెందిన ఓ యువకుడు నేడు దీనస్థితిని ఎదుర్కొంటున్నాడు. కొద్దో గొప్పో వ్యవసాయ భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. మంచి విద్యావంతుడై ఇంటికి పెద్దదిక్కుగా నిలబడాల్సిన యువకుడు నేడు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రయోజకుడయ్యాడనుకున్న వేళ ఆ యువకుడు జీవితాన్ని ఓ మహమ్మారి కుంగ తీసింది. ఇక వివరాల్లోకెళ్తే తంబళ్లపల్లి మండల కేంద్రంలోని కోసువారి పల్లి గ్రామపంచాయతీ నల్లతిమిరెడ్డిగారిపల్లి కు చెందిన వెంకట రమణారెడ్డి కుమారుడు అమరనాథ్ రెడ్డి వీరిది కొద్దిపాటి వ్యవసాయ రైతు కుటుంబం. ఇతని తల్లితండ్రులు పడుతున్న కష్టం కలారా చూసి మంచి ఉద్యోవంతుడై ప్రయోజకుడవ్వాలని ఎన్నో కలలు కంటూ విద్యలో రాటు తేలాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న కూడా అన్నిట్లోనూ మంచి ఉత్తీర్ణత సాధించి ప్రయోజకుడయ్యాడు. బెంగళూరులో ఉద్యోగం చేసుకుంటూ తల్లితండ్రుల అవసరాలకు తన ఖర్చులను మిగిల్చుకొని మిగిలింది పంపేవాడు. అతడు పడుతున్న ఇబ్బందులను చూసి ఇంట్లో పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారు. ఉన్నదాంట్లో పెళ్లి చేశారు. బెంగళూరులో ఉద్యోగం కావడంతో భార్యను



బెంగళూరులోని కె.ఆర్ పుర ప్రాంతంలో ఓ అద్దె ఇంటిని తీసుకొని సంసారాన్ని సాగిస్తున్నాడు. కొద్ది రోజులకు ఓ భయంకర మహమ్మారి ఆ యువకుడి ఆనందాన్ని బుగ్గిపాలు చేసింది. రెండేళ్ల క్రితం ఆ యువకుడికి ఊపిరితిత్తుల సమస్య ఏర్పడింది. అమరనాథ్ రెడ్డి ని బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చూపించారు. లక్షల రూపాయలు ఖర్చు చేయడంతో అప్పుడు కొద్దిగా జబ్బు నయమైంది. ఆరోగ్యం కుదుటపడి యధావిధిగా ఉద్యోగం చేసుకుంటూ సంసారాన్ని సాగిస్తున్నాడు. నెల కిందట మళ్లీ యధావిధిగా ఆరోగ్యం క్షీణించడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మళ్లీ అదే వ్యాధి కబళించింది. పది రోజులకే సుమారు 3లక్షల మేర ఖర్చు పెట్టారు. జబ్బు నయం కాకపోవడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని సెయింట్ జాన్సన్ ఆసుపత్రికి తీసుకెళ్లమన్నారు. ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు సుమారు 30 లక్షల మెర ఖర్చవుతుందని ఆ యువకుడు కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడని కాలేయం పూర్తిగా దెబ్బతిందని తెలపడంతో తల్లి తండ్రుల, భార్య నెత్తిన పిడుగు పడింది. ప్రస్తుతం సెయింట్ జాన్సన్ ఆస్పత్రిలోని ఐసీయూ లో చికిత్స అందిస్తున్నారు. వారానికి డయాలసిస్ కోసం 3 లక్షల నుండి 5 లక్షలు వసూలు చేస్తున్నారు. అమరనాథ్ రెడ్డి భార్య పద్మావతి పెళ్లికిచ్చిన కొద్దిగా ఉన్న బంగారాన్ని అమ్మి చికిత్స అందిస్తోంది. ఇక ఆ యువకుడి తల్లితండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తూ దాతల కోసం చెయ్యి చాచి వేడుకుంటున్నారు. ఈ యువకుడి గాథను దాతలు ఆలకించి దయనీయ స్థితిలో ఉన్న కుటుంబానికి సహకరించి ఆపన హస్తం అందించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతోమందికి ప్రాణ దానం చేస్తోంది. అలాగే ఈ యువకుడిని ఆదుకోవాలని మీడియా సైతం వేడుకొంటోంది. మనసున్న మారాజులు ఆదుకుంటారని కుటుంబం ఎదురుచూస్తోంది.

# ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు..

- పవిత్రత, క్రమశిక్షణ, ఆధ్యాత్మికతను గుర్తుచేస్తుందని వైయస్ జగన్ వ్యాఖ్యలు..
- రంజాన్ పండుగ మతసామరస్యానికి, సుహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి కరుణకు, దాతృత్వానికి ప్రతీక.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాస విశిష్టత.. మిథున్ రెడ్డి
- జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపం.. పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20- (రిపబ్లిక్ న్యూస్) -** ముస్లిం సోదరులకు వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలిపారు. రంజాన్ పండుగ సేవా భావం, సామరస్యం మరియు దాతృత్వానికి ప్రతీక అని, సమాజంలో శాంతి, సోదరభావం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ పండుగ పవిత్రత, క్రమశిక్షణ, ఆధ్యాత్మికతను గుర్తుచేస్తుందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రం మరియు ప్రపంచవ్యాప్తంగా అల్లాహ్ ఆశీర్వాదంతో శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి, సుహృద్భావానికి, సర్వ మానవ సమానత్వానికి కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు ప్రపంచ మానవళికి సకల శుభాలు కలగాలని జగన్ ఆకాంక్షించారు. క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాస విశిష్టత అని ఆయన పేర్కొన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని వైయస్ జగన్ తెలిపారు. మనిషిలోని చెడు భావనలను అధర్మాన్ని ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అంటూ జగన్ పేర్కొన్నారు. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా రంజాన్ మాసంలోనే దివ్య ఖురాన్ ఆవిర్భవించినదన్నారు. అందుకే ముస్లింలు ఈ నెలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తారన్నారు. రంజాన్ అంటే ఉపవాస దీక్ష మాత్రమే కాదని, మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాజంపేట పార్లమెంటరీ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజుల పాటు ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు నియమ నిష్టలతో కఠిన ఉపవాస వ్రతం ఆచరించే పుణ్యమాసానికి రంజాన్ ఒక ముగింపు వేడుక కాగా ఐకమత్యంతో మెలగడం, క్రమశిక్షణ కలిగి ఉండడం, పేదలకు తోడ్పడటం ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని ఆయన తెలిపారు. రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీకనని, ప్రజలందరికీ శుభసంతోషాలు కలగాలని మిథున్ రెడ్డి ఆకాంక్షించారు. తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి నియోజకవర్గ ముస్లిం సోదరులకు వైసీపీ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఆ అల్లాహ్ చల్లని దీవెనలు నిరంతరం ఉండాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ప్రార్థించారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ మాసం ముగిసిందని జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపమని ఆయన పేర్కొన్నారు. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా జరుపుకుంటున్న ప్రతి ఒక్క ముస్లిం సోదరుడికి అల్లా చల్లని దీవెనలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు..

## మహిళలు చట్టాల పై అవగాహన పెంచుకోవాలి



**అనంతపురం సంక్షేమం, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్):** విద్యావంతులై అన్ని అంశాల్లో సంపూర్ణ అవగాహన పెంచుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమని మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ బీ. ఎన్.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ పీడీ ఎం.శ్రీదేవి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని చంద్రబాబు నాయుడు కొట్టాలలోని అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్ వైజర్ భారతి సమక్షంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మిషన్ వాత్సల్య జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎన్ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళల హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్య, స్వావలంబన, సమానత్వం వంటి అంశాలపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు 20 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివక్షను నిర్మూలించడం, చట్టపరమైన హక్కులపై విజ్ఞానం పెంపొందించుకోవడం మహిళా సాధికారతకు తోడ్పడే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా విస్తృత అవగాహన కోసం సమావేశాలు, ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతా మణి, సిబ్బంది మంజుల, రాజ్యలక్ష్మి, డీసీసీ లీగల్ కౌన్సిలర్ నర్మద, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

## జాతర .. జనసంద్రం

### డ్రోన్ల నిఘాతో కట్టుదిట్టం



**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 20,కళ్యాణదుర్గం** శ్రీ అక్కమాంబ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేడుకలో భాగంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోఅక్కమాంబ జాతర సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివస్తుండగా, గుంపులుగా ఉండడంతో నేరాలకు తావు లేకుండా పోలీసులు ముందుగానే కట్టుదిట్టమైన ప్రణాళిక అమలు చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి "జీరో టాలరెన్స్" విధానంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జాతర ప్రాంతం మొత్తం డ్రోన్ల కళ్లతో ఆలయం చుట్టుపక్కల, రద్దీ కూడళ్లలో, పార్కింగ్ ప్రదేశాల్లో ప్రతి కదలికను డ్రోన్లు పర్యవేక్షిస్తున్నాయి. గుంపుల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి, చిన్న సంకేతం వచ్చినా వెంటనే స్పందించేలా ప్రత్యేక భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నారు. జాతరలో మాబ్ కంట్రోల్ కీలకంగా మారడంతో పోలీసులు వ్యూహాత్మకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణతో పాటు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చి నిఘా ఏర్పాటు చేశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి శక్తి టీమ్స్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా చిన్న గందరగోళం తలెత్తినా కూడా వెంటనే అదుపులోకి తీసుకొచ్చేలా పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. ఇటీవలి కాలంలో జాతరలు, పెద్దసమావేశాల్లో చోరీలు, గొడవలు, మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి పోలీసులు ముందస్తు చర్యలతో నేరాలకు గట్టి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. "నిఘాతో తప్పించుకోలేరన్న విధానం డ్రోన్ల ద్వారా స్పష్టంగా అర్థమవుతుందని చెప్పవచ్చు. భక్తులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తి ఉత్సవంగా సాగే జాతరలో నేరాలకు అవకాశం ఇవ్వకుండా పోలీసులుడ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎక్కడకూడా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు బృందాలు కట్టుదిట్టమైన భద్రత కొనసాగిస్తున్నారు.

## పలమనేరు మాజీ శాసనసభ్యులు రాజన్ ఇక లేరు..

### నిరాడంబర జీవనానికి నిలువెత్తు నిదర్శనం..!

### ఎంతోమందికి ఆయన జీవితం ఆదర్శం..



**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -** చిత్తూరు జిల్లాలోని పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఠాణేదార్ చిన్న (టి.సి.) రాజన్ కన్నుమూశారు. 106 ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణ వార్తతో పలమనేరులో విషాదం నెలకొంది. రాజకీయ ప్రముఖులు రాజన్ మృతి పట్ల పలువురు రాజకీయ నేతలు, విద్యా, వ్యాపారవేత్తలు అన్ని పార్టీలకు చెందిన నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. టి.సి. రాజన్ 1967లో స్వతంత్ర పార్టీ తరపున పలమనేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో ఆయన తన సుదీర్ఘ సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన రాజన్ తన జీవితాంతం దేశ సేవకే అంకితమయ్యారు. గాంధీజీ, నేతాజీ సిద్ధాంతాలను అనుసరించిన రాజన్ తన జీవితంలో ఎప్పుడూ విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే రాజన్ ఎలాంటి ఆస్తులు కూడబెట్టలేదు. సొంత ఇల్లు కూడా లేకుండా ఎంతో నిరాడంబరంగా జీవించారు. ప్రభుత్వ పింఛన్‌తోనే ఆయన తన జీవనాన్ని కొనసాగించారు. 2025లో తన 108వ జన్మదినాన్ని జరుపుకున్న రాజన్ చివరి వరకు సరళ జీవనాన్ని పాటించారు. ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత, నిజాయితీ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయి. రాజన్ మృతితో ఒక గొప్ప నాయకుడిని, నిజాయితీ గల ప్రజా సేవకుడిని రాష్ట్రం కోల్పోయింది.

## నూతన హిటాచి యంత్రాన్ని ప్రారంభించిన యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి



**కల్లూరు ప్రతినిధి, మార్చి 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కల్లూరు అర్బన్ : 28వ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మధు నూతనంగా హిటాచి వాహనాన్ని కొనుగోలు చేశారు. వారి కోరిక మేరకు హిటాచి వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శుభారంభం చేసి శు భాకాంక్షలు తెలిపిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి,ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి, ప్రతాప్ రెడ్డి గారు, అచ్చి రెడ్డి, ఇలియాస్, విష్ణు రెడ్డి, నాయుడు, తిరుమల,సాయి, దుర్గాప్రసాద్, అంజి ,చార్లెస్ తదితరులు పాల్గొన్నారు

## బేతంచెర్ల మండల కేంద్రంలో పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన



**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త కానాల రమణారెడ్డి అనారోగ్యంతో గత నెల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శు క్రవారం వారి ఇంటి దగ్గరికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే భారత్ గ్యాస్ బుగ్గన రమణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్నాడు విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన వారి ఇంటి దగ్గరికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వైసిపి పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా అందరినీ ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మరియు విశ్వ హిందూ పరిషత్ తెలుగు క్యాలెండర్లను విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గనతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మండల వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాజా హుస్సేన్, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ షేక్ పిట్టల జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు ఇబ్రహీం, వైబి శేఖర్ రెడ్డి, సలీం, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు,వైసీపీ నాయకులు మనుమోహన్ రెడ్డి, మల్దిరెడ్డి, పిక్కిలి మనోహర్ నాయుడు, అవివేటి చంద్రశేఖరయ్య, ఆర్ టి ఐ వింగ్ రాఘవేంద్ర రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్, పబ్లిసిటీ వింగ్ వలి భాషా, శాలి బేగ్, మండల ప్రధాన కార్యదర్శి ఎద్దులన్న, మహేష్, మహబూబ్, నవీన్ ౦౦౦ కాజా, తదితరులు పాల్గొన్నారు

## చిప్పగిరి లో హెచ్ పి వి టీకా కార్యక్రమం



**చిప్పగిరి, మార్చి, 20, (రిపబ్లిక్ న్యూస్)** స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు శుక్రవారం హెచ్పీవీటి యొక్క కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ అఫ్రోచ్ జహన్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో నిర్వహించారు, ఎంఓ అఫ్రోచ్ జహన్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు వయసు ఉన్న వారందరూ ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేస్తున్నారని గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేసుకోవాలని, మొదటి డోస్ తీసుకున్న ఆరు నెలల తర్వాత రెండో డోస్ తీసుకోవాలని, ఈ టీకా పూర్తి సురక్షితమని టీకా వారి శరీరంలో బలమైన రోగ నిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ లు రామ్మోహన్, చంద్రకళ, ఏఎన్ఎంఎస్ లు శాంతకుమారి, గాయత్రి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ సంవత్సరం ఇంటర్ లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

## :-ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర

**పాములపాడు మార్చి 20 రిపబ్లిక్ న్యూస్:-**



మండల కేంద్రమైన పాములపాడులోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగ రవీంద్ర తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2026-2027 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ లు గ్రూపులైన ఎంపీసీ బైపిసి, సిఇసి ఎంఇసి లలో ప్రతి కోర్స్ కు 40 సీట్ల చొప్పున 160 సీట్లు కలవని తెలిపారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. చక్కటి వాతావరణం సౌకర్యవంతమైన క్రీడా ప్రాంగణం ఉత్తమ విద్య బోధన సుశిక్షులైన ఉపాధ్యాయుల తో విద్యాబోధన అందించబడుతుందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం ట్రిబుల్ ఐటీ సీట్లలో చాలామంది ప్రతిభవంతు విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారని వారు పేర్కొన్నారు.ద

# ఉగాది పండుగ రోజున చంద్రబాబు చెప్పినవన్నీ అసత్యాలేనా..

## -మాజీ మంత్రి ఆర్ కే రోజా

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -**




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారం లో ఉన్న తెలుగుదేశం - జనసేన - భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం పై వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్ కే రోజా ఘాటు విమర్శలు చేశారు. ఉగాది పర్వదినాన చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటనలను తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వానికి చురకలు అంటించారు. ఉగాది పర్వదినం నాడు సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలేనని రోజా దుయ్యబట్టారు. పండగ పూట కూడా రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆమె అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. చంద్రబాబు ఉగాది రోజున ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పడం పూర్తిగా అసత్యమని, పాచిమాటలు మాట్లాడారని విమర్శించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు, మేనిఫెస్టోలోని 145 వాగ్దానాలు అమలు కాలేదని రోజా ఆరోపించారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు 1,500 రూపాయలు ఇస్తామని చెప్పి మాట తప్పారని, ఈ పథకం అమలు చేయలేదని అన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, నిరుద్యోగులకు 3,000 రూపాయల భృతి ఇస్తానని వాగ్దానం చేసి మోసం చేశారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎలా సంతోషంగా ఉంటారని ప్రశ్నించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేదలు, ఉద్యోగులు, రైతులు సంతోషంగా ఉన్నారని రోజా గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాతన ధర్మం గురించి మాట్లాడుతున్నప్పటికీ, ఉగాది సందర్భంగా ప్రజలకు కనీసం శుభాకాంక్షలు కూడా తెలియజేయలేదని తప్పుపట్టారు. అర్హతలేని వారికి పదవులు ఇస్తే ఇలాంటి పరిస్థితులు వస్తాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఖరిపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరముందని ఆమె డిమాండ్ చేశారు..

# నెల రోజుల పాటు కఠోర దీక్షలతో చేపట్టిన రంజాన్ ఉపవాస దీక్షలు సమాప్తం..

## నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు.. నిస్సార్ అహ్మద్

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -**

రంజాన్ మాసం చివరి శుక్రవారమైన జుమా - తుల్ - విదా ను ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి మదనపల్లె వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణ పరిధిలోని ఈశ్వరమ్మ కాలనీ లో గల మస్జిద్ ఎ రహ్మతయల్ అలమీన్ లో తోటి ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి భక్తిశ్రద్ధలతో నమాజ్ చదివి రంజాన్ పండుగ శుభాకాంక్షలు చెప్పుకొంటూ ఒకరినొకరు అలింగణం చేసుకొని సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ముస్లిం, మైనార్టీల ఆహ్వానం మేరకు మదనపల్లి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ మసీదుకు విచ్చేశారు. మస్జిద్ ప్రాంగణం వద్దకు విచ్చేసిన నిస్సార్ అహ్మద్ ను ముస్లంలు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్చమందించి స్వాగతించారు. రంజాన్ ఉపవాస మాసం








చివరి రోజు కావడంతో మస్జిద్ లో ప్రార్థనలు చేయడానికి అధిక సంఖ్యలో ముస్లిం మైనార్టీ సోదరులు తరలివచ్చారు. అందరితో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. నిస్సార్ అహ్మద్ వీరందరికీ రంజాన్ పండుగ సారాంశాన్ని ఉపదేశించారు. ప్రార్థనానంతరం ప్రార్థనలు చేసేందుకు విచ్చేసిన ముస్లిం మైనారిటీ సోదరులను పేరుపేరునా పలకరించారు. వారికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ మనిషిలోని చెడును తొలగించి, మంచి మార్గం చూపించే రంజాన్ మాసం ప్రతి ముస్లిం జీవితకాలం ఆ మార్గాన్ని అనుసరించాలని చెబుతుందని వివరించారు. నెల రోజులు పాటు చూపిన క్రమశిక్షణ జీవితకాలం మన అలవచుకోవడం ద్వారా అల్లాహ్ కు దగ్గర కావచ్చనే సూత్రం రంజాన్ పవిత్రకు సూచికని వెల్లడించారు. క్రమశిక్షణ, దానగుణం, సహనం, సోదరభావానికి రంజాన్ మాసం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలకు ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# వైష్ణవి మాత ఆలయంలో శుక్రవారం పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 20 రిపబ్లిక్ న్యూస్**

చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం, చైత్రమాసం, వసంత నవరాత్రుల్లో రెండవ రోజున ఆలయ అర్చకరాలు శ్రావణి అమ్మవారికి ఉదయమే పంచామృత అభిషేకం చేసి అమ్మవారిని ఎంతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు .చౌడేపల్లి, పుంగనూరు ,రామసముద్రం ,చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు .అమ్మవారి సన్నిధిలో మహిళలు సౌందర్యలహరి పారాయణం ,కుంకుమార్చనలు చేసుకున్నారు.ఈరోజు ఉభయదారులుగా రామసముద్రానికి చెందిన రమేష్ బాబు, సుమలతలు వ్యవహరించారు .ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 20 రిపబ్లిక్ న్యూస్**

శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సరం రెండవ రోజున శుక్రవారం ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి దంపతుల సమక్షంలో అమ్మవారిని వేద పండితులు అభిషేకించారు రాహుకాల అభిషేక అనంతరం గంగమ్మను విశేషంగా అలంకరించారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార అర్చక సిబ్బంది భక్తులకు వసతులను సమకూర్చారు.

# ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసాలు- రైతులు అప్రమత్తంగా ఉండాలి

## నకిలీ కాల్స్, లింక్స్‌పై జాగ్రత్త అనుమానం వస్తే వెంటనే 1930కు కాల్ చేయాలి: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 20)**

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సూచించారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రైతులు మోసపోవద్దని హెచ్చరించారు.

తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు, ఓటీపీ ( ఓటిపి) అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దని తెలిపారు. ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే నకిలీ కాల్స్, వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపే లింక్స్‌పై నమ్మకం పెట్టుకుని క్లిక్ చేస్తే డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా అమలు చేస్తున్న “అన్నదాత సుఖీభవ”, “పీఎం కిసాన్” పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు



రైతులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

**సైబర్ మోసాల పద్ధతులు:**

- నకిలీ కాల్స్: పథకం నిధులు వచ్చాయని చెప్పి ఏటీఎం, పిన్, ఓటిపి అడగడం
- నకిలీ లింక్స్: వాట్సాప్/ ఎస్ఎంఎస్ ద్వారా లింక్స్ పంపి బ్యాంక్ వివరాలు తీసుకోవడం

మోసం: కేవైసీ పెండింగ్‌లో ఉందని చెప్పి ఆధార్ వివరాలు సేకరించడం

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

ఓటిపి ఎవరితోనూ పంచుకోకండి బ్యాంక్ అధికారులు ఎప్పుడూ అడగరు

అపరిచిత లింక్స్ క్లిక్ చేయవద్దు

నిధుల వివరాలు స్వయంగా చెక్ చేసుకోండి పాస్‌బుక్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారాసందేహం ఉంటే (ఆర్బికే) లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించండి సహాయం కోసం:ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి లేదా **www.cyber-crime.gov.in**-ల వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

# అనారోగ్యంతో మండల కన్వీనర్ మృతి

## చింతలపల్లిలో విషాద ఛాయలు





**మృతి చెందిన కాంగ్రెస్ మండల కన్వీనర్ గొల్ల జోగన్న ( ఫైల్ ఫోటో)**

**అనంతపురం క్రైమ్, మార్చి 20,(రిపబ్లిక్ న్యూస్):**

కళ్యాణదుర్గం నియోజకవర్గం సెట్టూరు మండలం చింతలపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. కాంగ్రెస్ మండల కన్వీనర్ చింతర్లపల్లి మల్లయ్య తండ్రి గొల్ల జోగన్న (85) అనారోగ్యంతో ఈరోజు ఉదయం మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.ఈ విషయం తెలుసుకున్న పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామంలో శోక వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో ప్రజలు చివరి చూపు చూసేందుకు తరలి వచ్చారు.ఈ ఘటనపై స్పందించిన నీలకంఠాపురం రఘువీరా రెడ్డి (కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు) చరవాణి ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అనంతపురం జిల్లా డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి కూడా పరామర్శిస్తూ పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసి అధికార ప్రతినిధి కంబదూరు ఈరన్న, కంబదూరు మండల కన్వీనర్ మధు, కుందుర్తి మండల కన్వీనర్ బుజ్జప్ప తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తమ సానుభూతిని తెలియజేశారు.ద

# జీడీడీపీ లక్ష్యాలకు రెట్టింపు దిశగా

## కర్నూలు కలెక్టర్ డా. ఏ. సిరి కఠిన ఆదేశాలు

### 2026-27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

### ప్రతి ఇంటి మౌలిక సదుపాయాల సర్వేకు ఆదేశం - వ్యవసాయం, పరిశ్రమలు, యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 20)**

జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీడీడీపీ లక్ష్యాలను సాధించడమే కాకుండా వాటిని రెట్టింపు స్థాయిలో చేరుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు మించి ప్రగతి సాధించాలని సూచించారు. ప్రతి మండలం, నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాలని ఆదేశించారు.

ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల పనితీరును అధికారులు స్వయంగా తనిఖీ చేయాలని, తలసరి ఆదాయం పెంపు కోసం వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఉత్పాదకత పెంచాలని పేర్కొన్నారు. విద్యా రంగంలో మెరుగైన ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**ప్రతి ఇంటి మౌలిక సదుపాయాలపై సమగ్ర సర్వే**

జిల్లాలో ప్రతి ఇంటికి సంబంధించిన గృహం, తాగునీరు, శానిటేషన్, విద్యుత్, గ్యాస్, ఇంటర్నెట్ వంటి మౌలిక





సదుపాయాలపై పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. లోటుపాట్లను గుర్తించి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.

**వ్యవసాయం పరిశ్రమలు ఉపాధి పై దృష్టి**

డ్రోన్ వినియోగం, బహుళ పంటల సాగు, ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణమైన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి, జర్మన్ భాష శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు.

**అభివృద్ధి పనులకు వేగం**

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, ఎయిర్‌పోర్ట్ విస్తరణ, హెలిపోర్టు ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. చెరువుల పూడిక తొలగింపు, మైక్రో ఇరిగేషన్ పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని సూచించారు.

**మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

చెత్త నిర్వహణ, పార్కుల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, డ్రైనేజ్ వ్యవస్థల మెరుగుదలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఆరోగ్యం సేవల మెరుగుదల

ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను 24 గంటల్లో పూర్తి చేయాలని, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.

# కోటకొండ నెట్టికంటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



**పెద్దవడుగూరు మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్)**అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం సమీపంలోని వెలసిన కోటకొండ శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినాన్ని బ్రహ్మోత్సవాలు రెండు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి చుట్టుపక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవం అంగరంగ వైభవంగా భక్తాదుల నడుమున రథోత్సవం లాగారు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి కోదండపాణి, ఆలయ ధర్మకర్త ఈశ్వర్ రెడ్డి, లచ్చప్ప, బాల సిద్దయ్య , రామకిట్ట ,నాగేంద్రం, శ్రీనివాసులు, కే. నాగేశ్వర్, గుత్తి బండల రామాంజనేయులు, భక్తాదులు పాల్గొన్నారు



# కర్నూలు నగరాభివృద్ధిపై కలెక్టర్ ఏ. సిరి ప్రత్యేక దృష్టి

**నగరపాలక సంస్థ కార్యాలయంలో ఛాంబర్ ప్రారంభం -పన్ను వసూళ్లు, అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరాపై కీలక ఆదేశాలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 20)**
కర్నూలు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని జిల్లా కలెక్టర్ ఏ. సిరి తెలిపారు. శుక్రవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆమె తన కొత్త ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి. విశ్వనాథ్ పుష్పగుచ్చం అందించి కలెక్టర్‌ను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిపాలనలో సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం కార్యాలయంలో పూర్తి మ్యాప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.
పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించిన ఆమె, ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవి కృష్ణ,



డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ యన్. చిన్నరాముడు, ఎస్‌ఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలే కూటమి లక్ష్యం

**-ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల**

**- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కమ్మరి పార్వతమ్మ కృతజ్ఞతలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 20)**
ఉగాది సందర్భంగా యువతకు కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్లకు విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ కృతజ్ఞతలు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. గత 20 నెలల్లోనే సుమారు 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో దాదాపు 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించేలా ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. జాబ్ క్యాలెండర్‌లో విద్య మరియు పోలీస్ శాఖలకు ప్రాధాన్యం ఇస్తూ టీచర్ పోస్టులు, జూనియర్ లెక్చరర్లు, యూనివర్సిటీ అధ్యాపకులు, గ్రూప్-1, గ్రూప్-2, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ పెంపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం యువతను నిరుద్యోగంలోకి నెట్టిందని విమర్శించారు.

# ప్రజా సమస్యలపై పోరాటాల్లో ఆర్‌ఎస్‌పి ముందుంటుంది.

**ఘనంగా ఆర్.ఎస్.పి 86వ ఆవిర్భావ దినోత్సవం -ఆర్. ఎస్. పి కర్నూలు జిల్లా కన్వీనర్ ఎ. ఆనంద్**





**కర్నూలు ప్రతినిధి, మార్చి 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతూ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటాలు చేయడంలో రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ,ఆర్ఎస్‌పి, అగ్రభాగన ఉంటుందని ఆర్ఎస్‌పి కర్నూల్ జిల్లా కన్వీనర్ ఎ. ఆనంద్ తెలిపారు. ఆర్ ఎస్ పి పార్టీ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌పి 86వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించదానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. ఒకవైపు ప్రజా క్షేత్రంలో మరో వైపు 1955 నుండి చట్ట సభల్లో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రపంచం అంత శాంతియుతంగా ఉండాలని కోరుకుంటూ,ఆర్ఎస్‌పి తన పోరాటాలను మరింత ఉత్సాహంగా కొనసాగిస్తుందని తెలిపారు . అలాగే జిల్లాలో ప్రజలు, కార్మికులు, నిరుద్యోగ యువత, ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలనీ ప్రభుత్వంను డిమాండ్ చేశారు. భవిష్యత్లో పార్టీ తో పాటు అనుబంధ కార్మిక సంఘాలను బలోపేతం చేసి వారి హక్కుల సాధనకోసం పని చేస్తామని అన్నారు ఈకార్యక్రమంలో నాయకులు అయ్యన్న , స్వామి, శ్రీను,సురేంద్ర బాబు, మునిస్వామి, గంగాధర్, స్తుతి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# అలసందగుత్తి గ్రామం లో ఉగాది పండుగ సందర్భంగా అర్ధరాత్రి చౌడేశ్వరి అమ్మవారి కి బోనాలు





**ఆదోనిమార్చి 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఆదోని మండలం అలసందగుత్తి గ్రామంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించరు,ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి, సోమప్ప తాతకు మొక్కులు చెల్లించుకునరు . ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారు. ముఖ్యంగా అర్ధరాత్రి 1 గంటకు జరిగే బోనాల సమర్పణకు విశేష ప్రాధాన్యం ఉంది

# చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి



**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఓరకల్లు మండలం శకునాల గ్రామంలో ఉమ్మడి కర్నూల్ జిల్లాల మాజీ యూత్ వింగ్ కోఆర్డినేటర్ మండ్లెం మధుసూదన్ రెడ్డి తండ్రి రామలింగేశ్వర రెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి శుక్రవారం రోజు శకునాల గ్రామానికి వెళ్లి రామలింగేశ్వర రెడ్డి భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఓర్వకల్లు మండల నాయకులు, శకునాల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యువతకు ఉగాది కానుక 10,060 ప్రభుత్వ ఉద్యోగాలతో కూటమి ప్రభుత్వ జాబ్ క్యాలెండర్

**బెస్త సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు**

**ఆదోని ప్రతినిధి, మార్చి20,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'జాబ్ క్యాలెండర్' ఒక చారిత్రాత్మక నిర్ణయమని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ కొనియాడారు. శుక్రవారం ఆదోనిలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ మాట్లాడుతూ "యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది కానుకగా 10,060 ప్రభుత్వ ఉద్యోగాలతో కూడిన జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు పడిన ఆవేదనను గమనించి, పారదర్శకమైన నియామక ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం



చుట్టింది,అని తెలిపారు. మే 15, 2026: ఉన్నత విద్యాశాఖలో 1500 పోస్టుల భర్తీ,ఆగస్టు 15, 2026: గ్రూప్-1 ,91, హోమ్ శాఖ (2778), ఇతర శాఖలు (928) కలిపి మొత్తం 3797 పోస్టులు. సెప్టెంబర్ 15, 2026: గ్రూప్-2,,750, ఇంజనీరింగ్ ,503, ఇతర శాఖలు (506) కలిపి మొత్తం 1759 పోస్టులు. అక్టోబర్ 15, 2026: పాఠశాల మరియు ఇంటర్ విద్యలో 3004 పోస్టుల భర్తీ. గత 20 నెలల ప్రగతిని వివరిస్తూ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగ అవకాశాలను కల్పించిందని నేతలు గుర్తు చేశారు. గత పాలనలో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (రాఖీఎ) ప్రకారం గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ శాతం అధికంగా ఉండేదని, నేడు ఆ పరిస్థితి మారి యువతకు భరోసా లభిస్తోందని వారు పేర్కొన్నారు. సుమారు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇతర టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గ్యాస్‌పై అపోహలకు లోనవద్దు

**వంటకు విద్యుత్ ఉపకరణాల వినియోగం పెంచాలి : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు హెచ్చరిక**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 20)**
గ్యాస్ వినియోగాన్ని తగ్గిస్తూ విద్యుత్ ఆధారిత వంట పద్ధతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఎల్పీజీ గ్యాస్ అంశంపై డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వకాలంలో వాడే మట్టి పొయ్యిలు, కట్టెల పొయ్యిల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని, కళ్ళు మరియు ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందని తెలిపారు. అడవుల నిర్మూలనకు కూడా ఇవి కారణమవుతాయని చెప్పారు. ప్రస్తుత కాలంలో ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ వంట ఉపకరణాలు ఉపయోగించడం ఉత్తమమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సమృద్ధిగా ఉన్నందున ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.
ఈ మార్పులను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్డీఓలు చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రజలు అపోహలకు గురై అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. సాధారణంగా రోజుకు 9 వేల సిలిండర్లు అవసరమైతే, ప్రస్తుతం 11 వేల వరకు బుకింగ్ జరుగుతున్నప్పటికీ సరఫరా జరుగుతోందన్నారు.
ప్రజలు అపోహలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని సూచిస్తూ, గ్యాస్ సిలిండర్ల మళ్లింపు లేదా బ్లాక్ మార్కెటింగ్ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని మండలాల్లో తహశీల్దార్లు, సంబంధిత అధికారులు గ్యాస్ ఏజెన్సీలపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# పాసుబుక్స్ డ్రాఫ్ట్ పరిశీలనకు పిలుపు

**కానాల గ్రామ రైతులకు కీలక సూచనలు**



**నంద్యాల క్రైం, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్):** మండలంలోని కానాల గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తి కాగా, పట్టాదారు పాసు పుస్తకాల ముద్రణకు సంబంధించిన డ్రాఫ్ట్ నకళ్లు గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంచినట్లు నంద్యాల రూరల్ తహసీల్దార్ తెలిపారు. రైతులు తమ పొలాలకు సంబంధించిన డ్రాఫ్ట్ పాసు పుస్తకాలను సచివాలయంలోని విఆర్వో వద్ద పరిశీలించుకోవాలని సూచించారు. డ్రాఫ్ట్‌లో ఫోటో, ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్, కులం, సర్వే నెంబర్, భూవిస్తీర్ణం వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఏవైనా తప్పులు లేదా తేడాలు గమనించిన పక్షంలో వెంటనే విఆర్వో లేదా తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతుల అభ్యంతరాల ఆధారంగా తప్పులను సరిదిద్దిన తర్వాత తప్పులులేని కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. కావున గ్రామంలోని రైతులు అందరూ తమ డ్రాఫ్ట్ పాసు పుస్తకాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో ఘనంగా గ్రామోత్సవం.

**ఆలయ ఈవో యం. రామక్రిష్ణ.**



**పాణ్యం ప్రతినిధి. మార్చి 20. (ప్రజారిపబ్లిక్ న్యూస్)** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు ఉగాదిని పురస్కరించుకుని గురువారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో యం. రామకృష్ణ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యములు, బాణ సంచారంతో గ్రామ పురవీధుల గుండా అంగరంగ వైభవంగా గొప్ప ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి భక్త చింతామణి పూర్తి నాటక ప్రదర్శన నిర్వహించారు.

**అర్చకులకు ఉగాది పురస్కారము.**

దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు గురువారం ఆలయ ప్రధాన అర్చకుల పురస్కారం నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పుల్లయ్య స్వామి, వీరయ్య స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిలిటరీ సుబ్బారెడ్డి, సిబ్బంది శాలువాలు, పూలమాలలు, శేష వస్త్రములు, 10,116/- పారితోషికం సమర్పించి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వేద పండితుడు రోహిత్ శర్మ వారిని సత్కరించారు.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

## రంజాన్ మాస చివరి రోజు ముస్లిం మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన - కలిచర్ల సుధాకర్ రెడ్డి




**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -**
తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని పెద్దమండ్యం మండల కేంద్రమైన కలిచర్ల గ్రామంలోని దర్గాపై వెలసిన మౌలాక పహాడ్ వద్దనున్న మద్దుం ఇలాహి మస్జిద్ లో రంజాన్ ఉపవాస దీక్ష ముగింపు సందర్భంగా ఆఖరి రోజు శుక్రవారం ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముస్లిం మైనార్టీ సోదరులు ఆహ్వానం మేరకు దివంగత శాసనసభ్యులు కలిచర్ల ప్రభాకర్ రెడ్డి సోదరుడు సింగల్ విండో మాజీ చైర్మన్ కలిచర్ల సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మస్జిద్ వద్దకు విచ్చేసిన సుధాకర్ రెడ్డిని ముస్లింలు దుశ్శాలువా కప్పి ముస్లిం సాంప్రదాయ రీతిలో సత్కరించారు. అనంతరం ముస్లిం మైనార్టీలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారితో కలిసి నమాజ్ చదివారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలసి జీవించే దేశం మనదని ఇక్కడ ప్రతి పండగకు ఒక ప్రత్యేకమైన అర్థం ఉంటుందన్నారు. అలాంటి పండగలలో ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండగ రంజాన్ (ఈద్–ఉల్–ఫిత్ర్) అని ఇస్లాం మతానికి చెందిన అత్యంత పవిత్రమైన మాసమని ఇతరుల పట్ల మానవత్వం, పరస్పర గౌరవం, సహానుభూతి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పండగన్నారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మండల ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, ఆర్ బి కే మాజీ చైర్మన్ చాంద్ భాష, మండల కన్వీనర్ రెడ్డప్ప, సీనియర్ నాయకులు కేశవ, సర్పంచ్ లు విశ్వనాథ, తిరుపాల్ నాయక్, మండల యువ నాయకుడు సాదిక్, వైస్ సర్పంచ్ అమీన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లతీఫ్, షబ్బీర్, గౌస్, ప్రతాప్, జైరాం తదితరులు పాల్గొన్నారు..

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి..

- జిల్లావ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు.. - నిఘా వలయం లో పాలుపంచుకోనున్న డ్రోన్లు, సీసీ కెమెరాలు..
- శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని పిలుపు..
- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -**
కఠినమైన రంజాన్ ఉపవాస దీక్షలు ముగించుకుని, శనివారం 'ఈద్ – ఉల్ – ఫితర్' జరుపుకోనున్న ముస్లిం సోదర సోదరీమణులకు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ భద్రతా ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద ముందస్తు భద్రతా



చర్యలు చేపట్టామని ప్రార్థనల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పండుగ ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచుతున్నామని సోషల్ మీడియా వేదికలపై ఎవరైనా మత విద్వేషాలు లేదా వదంతులు వ్యాప్తి చేస్తే, సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లపై కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సర్వమత సమ్మేళనానికి ప్రతీక అయిన మన దేశంలో, ఒకరి భావాలను మరొకరు గౌరవించుకుంటూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ముస్లిం సోదరీ సోదరులకు మరియు పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ 'రంజాన్' పండుగ శుభాకాంక్షలంటూ పేర్కొన్నారు..

## గ్యాస్ గోదాం పై ఆకస్మిక తనిఖీ.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్ పుణ్యవతి



**గుత్తి మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలోని ఇటీవల ఏర్పడిన గ్యాస్ సిలిండర్ల కొరతపై తహసీల్దార్ పుణ్యవతి స్పందిస్తూ, మండల పరిధిలోని గ్యాస్ గోదాములు మరియు ఏజెన్సీలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో గ్యాస్ నిల్వ విధానం, స్టాక్ వివరాలు, సరఫరా రికార్డులు మరియు భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. కొంతమంది డీలర్లు సరైన రికార్డులు నిర్వహించకపోవడం, నిల్వలో అసమానతలు ఉండటం గమనించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ పుణ్యవతి మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్ల కొరతకు కారణమైన అంశాలను గుర్తించి వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా సిలిండర్లు నిల్వచేసి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రస్తుతం సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉన్నప్పటికీ, అదనపు సిలిండర్లను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వస్తుందని భరోసా ఇచ్చారు.ప్రజలు గ్యాస్ కొరతపై ఆందోళన చెందకుండా సహనం పాటించాలని, అవసరమైన వారికి ప్రాధాన్యత క్రమంలో సిలిండర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ తనిఖీలలో ఉప తాహసిల్దార్ సూర్యనారాయణ రెవెన్యూ సిబ్బంది మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఓబులవారిపల్లెలో వైభవంగా ఏకవీర గంగమ్మ జాతర.







**ఓబులవారిపల్లి మార్చి 20 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం జిల్లెల్ల మడక వడ్డేపల్లి లో వెలసిన ఏకవీర గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది, వివరాల్లోకి వెళితే గురువారం సాయంత్రం జిల్లెల్ల మడక ఏకవీర గంగమ్మను గుడి నుంచి వెలికి తీసి జిల్లేల్ల మడక మడుగులో శుభ్రపరచి ఆమెకు పట్టు వస్త్రాలను ఓబిలి గోవింద్ గారి కుటుంబం నుంచి తీసుకెళ్లిన పట్టు వస్త్రాలతో పలు రకాల పువ్వులతో మరియు పూలదండలతో అంగరంగ వైభవంగా అలంకరించి అక్కడ నుంచి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో రంగురంగుల బాణాసంచా వెలుగుల్లో ఏకవీర గంగమ్మకు ముందు పోతుల రాజు ఊరేగింపుగా వెళుతుంటే ఆ వెనకే ఏకవీర గంగమ్మ బయలుదేరి ఓబులవారిపల్లెలోని సత్తెమ్మ దేవాలయం లోకి తీసుకెళ్లి అక్కడ వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పనిబాపలోళ్లు, ఓబులవారిపల్లి అరవపల్లి ఎగువపల్లి కల్లాలమిట్ట బొంత వారి పల్లి శివశంకరపురం పుటికవారిపల్లి కటికంవారి పల్లి వడ్డేపల్లి, కే వడ్డిపల్లి, ముదినేపల్లి గ్రామాల పొలిమేరల్లో స్వాగత తోరణాలు నిర్మించగా ప్రతి పొలిమేరలో ఏకవీర గంగమ్మను దీవిస్తూ గ్రామ గ్రామాన ఆమెను ఊరేగింపుగా ఊరేగిస్తూ పురవీధులలోభక్తుల పూజలు అందుకున్నారు,

# బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

- తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ..
- ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు..
- శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని వ్యాఖ్యలు..
- సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీలక ఆదేశాలు.. ధీరజ్ కునుబిల్లి

**ఏపీ బ్యూరో, మార్చి 20 - (రిపబ్లిక్ న్యూస్) -**
స్థానిక నియోజకవర్గ పరిధిలోని తంబళ్లపల్లి మండల కేంద్రమైన మదనపల్లి సబ్ డివిజన్ పరిధి లోని స్థానిక పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను, లాకప్ రూమ్, మరియు స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై ఎస్ఐ అనిల్ కుమార్‌తో సమీక్ష నిర్వహించారు. తనిఖీలో భాగంగా పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాలలోని ఫ్యాక్షనిజం, రాజకీయ మరియు మతపరమైన సున్నితమైన



అంశాలపై నిరంతరం నిఘా ఉంచాలని ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే నేరాల శాతం ఎలా ఉందని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాలు, గ్యాంబ్లింగ్, మరియు అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. తీవ్రమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని కోరారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి, వారిలో భరోసా నింపాలని ముఖ్యంగా మహిళలు, పిల్లల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోలీస్ సిబ్బందితో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరగాలపై సైబర్ మోసాల పై గ్రామాలను సందర్శించి గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధిక శాతం సైబర్ నేరగాళ్ల చేతిలో గ్రామ ప్రజలే మోసపోతున్నారని గ్రామాల్లో తిరుగుతూ గ్రామస్తులకు సైబర్ మూసాలపై వివరించాలని ఎస్పీ సూచించారు.

**ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి..**
గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పొద్దని సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని గ్రామాల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎస్ఐ అనిల్ కుమార్ మరియు స్టేషన్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వర రావు, కానిస్టేబుల్ లు రాఘవ, శివ తదితర సిబ్బంది పాల్గొన్నారు..

# గాలివాన వడగండ్ల బీభత్సం

# రైతన్నకు కన్నీటి కష్టం



**ఓబులవారిపల్లి మార్చి 20 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలంలో బుధవారం రాత్రి కురిసిన వాన, వడగండ్లు, వీటికి తోడు ఈదురు గాలులు భారీగా తొడవడంతో మండలంలోని రైతన్నకు ప్రకృతి కన్నీరు మిగిల్చింది, ఓబులవారిపల్లి చిన్నవరంపాడు బొమ్మ వరం పెద్దవరంపాడు వై కోట జీవీపురం చెన్నరాజుపాడు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గ్రామాలు ప్రకృతి బీభత్సానికి నేలకొరిగిన అరటి తమలపాకు తోటలు రైతన్న కంట కన్నీటి మంట, సుమారు మండలంలో 650 ఎకరాలలో అరటి తోట వడగండ్ల వర్షానికి రైతన్న నడ్డి విరవగా 500 ఎకరాలలో తమలపాకు తోటలు భూమిపై పడకేసాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, సున్నపురాలపల్లి ఎగువపల్లి కమ్మపల్లి అరటి పంట చేతికొచ్చే దశలో వర్షం,వడగండ్లు, ఈదురు గాలులకు పంట పూర్తిగా నేలమట్టం కావడంతో సుమారు 500 మంది రైతుల జీవితాలు చీకటిలో కి నెట్టబడ్డాయని అప్పులు చేసి ఎకరాలకు ఎకరాలు అరటి తమలపాకు తోటలు సాగు చేశామని కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం



రావడంతో అప్పులు ఎలా కట్టాలో ఎలా తీర్చాలో తెలియక తీవ్ర ఆవేదనలో ఆలోచనలో ఏం చేయాలో తెలియని దిక్కు తోచని స్థితిలో ఉన్నామని, కూటమి ప్రభుత్వం మేము రైతుల పక్షపాతం అని చెప్పుకోవడం కాదు ఇప్పుడు ఆదుకోవాలని అధికారులు పంటలను పరిశీలించి తనిఖీ చేసి నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు

## పొట్టకూటికోసం పొయ్యిలో చేతులు, కాళ్లు కాల్చు కొంటున్న పిల్లలు

### ఇది ఏ.పీ ఆర్. గురుకుల విద్యార్థులు అవస్థలు.

**ఓబులవారిపల్లిమార్చి20 రిపబ్లిక్ న్యూస్.**
గురుకులాలు అంటే గొప్ప క్వాలిటీ విద్యకు నిదర్శనమని ఈ గురుకులాల్లో సీటు సంపాదించాలంటే అంత సులభం కాదని రాష్ట్ర వ్యాప్తంగా ఎంట్రెన్స్ నిర్వహించి, మెరిట్ ప్రకారం అడ్మిసన్స్ నిర్వహించి వారిని కళాశాలలోచేర్చుకుంటారు,ఈ గురుకుల పాఠశాల లో అన్ని కులాల విద్యార్థులకు ఎంట్రెన్స్ మెరిట్ ద్వారా ప్రవేశం ఉంటుంది. ఈ పాఠశాలలో సీటు దక్కితే వారి భవిష్యత్ గురించి పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరం ఉండదని,రాష్ట్రంలోనే అత్యంత క్వాలిటీ ఉన్నత విద్యను అందించే విద్యాలయాల్లో ఏపీ గురుకుల విద్యాలయాలు ప్రథమంగా ఉంటాయని,ఈ విద్యాలయాల్లో క్వాలిటీ విద్యతో పాటు క్వాలిటీ భోజనాలు కూడా అందించడం జరుగుతుందని, ఏపీ గురుకులాలు అంటే ఆ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని వసతులు నాలుగు గోడల మధ్య నిర్వహిస్తుంటారని,అలాంటి గురుకులాలు నేడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి,అక్కడ పిల్లలకు సక్రమమైన వసతులు లేకపోవడమే కాకుండా క్వాలిటీ విద్య కూడా మోపిస్తున్నట్లు తెలుస్తోంది,మరి దారుణమైన విషయానికి వస్తే ఆకలి వేస్తే వంట చేసుకుని, గంట మ్రోగితే పరుగు పరుగున తిని తినక,పస్తులతో తరగతి గదులకు వెళుతూ అత్యంత దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న గురుకుల పాఠశాలల్లో నాడు కడప, నిన్న అన్నమయ్య, నేడు తిరుపతి జిల్లాకు చేందిన రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లె ఏపీ ఆర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థుల పరిస్థితి గత మూడు రోజులుగా దయనీయంగా తయారయింది. వీరికి ఆకలేస్తే పొట్టకూటి




కోసం చదువులు కూడా వదిలేసి కాళ్లు చేతులు పొయ్యిలో పెట్టి కాల్చుకుని వంట చేసుకుని తిని క్లాస్ కు వెళ్లవలసిన దుస్థితి దాపురించింది,దీని అంతటికి కారణం ఆ పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులకు అన్ని వసతుల పట్ల ఆలన పాలన చూడాల్సింది పోయి అక్కడున్న రోజువారి కూలీలైన వంట మనుషులపై దొంగతనం నేపంవేసి వారిని ఎగనామం పెట్టే పరిస్థితి తీసుకొచ్చారు. దీంతో గత మూడు రోజుల నుంచి ముక్క వారి పల్లె గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి, ఒకవైపు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మరోవైపు ఆకలి కేకలతో వంట వార్పుల పనులు,పరీక్షల సమయంలో చదువుకోవాల!వంట చేయాలా!ఆకలి తీరదు, ఆకలి తీరితే పరీక్షలకు చదువుకోలేని పరిస్థితి. గత మూడు రోజుల నుంచి ఉదయం పూట టిఫిన్లు లేకుండానే పరీక్షలు రాసి మధ్యాహ్నం 12 గంటల తరువాత వంట చేసుకుని తినాలి ఆ విద్యార్థుల దీన స్థితి అవస్థలు, వీరు పడుతున్న బాధలు,నరకయాతన గురించి బయటకు



చెప్పుకోవాలన్న వారిని బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా గేట్లు మూసివేసి, వారితోనే వారి వంట వారు చేసుకుని చాలీచాలని ఆకలితో అలమటిస్తూ వేదన పడుతున్నప్పటికీ ఆ ప్రిన్సిపల్ వారి పట్ల దయ,కరుణ చూపకుండా రాక్షసత్వాన్ని పాటిస్తూ వారిని నరకయాతనకు గురిచేస్తున్నారు. విషయం తేల్చుకోవడానికి శుక్రవారం ప్రిన్సిపాల్ ను ప్రశ్నించగా పాఠశాలలో పనిచేసే వంటమనుసులు నిత్యవసర సరుకులు దొంగలించడంతో వారిని మందలించడం జరిగిందని, దీంతో వారు గత మూడు రోజులుగా వంట చేయడానికి రాకపోవడంతో పిల్లలే వండుకుని తినే పరిస్థితి దాపురించిందన్నారు. తన కేడర్ ఆర్డీవో స్థాయి అయినప్పటికీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఉద్యోగం చేస్తూ 400 మందికి పైగా పిల్లలకు కాపలాదారుడుగా ఉన్నానని, ఆయనకు హోదాకు తగ్గ అర్హత లభించలేదన్నట్లు నిరాశ వెలిబుచ్చారు. ఎగనామం పెట్టిన వంటమనుషులను పిలిపించి మాట్లాడతానని తెలియజేశారు.

# అక్రమ సంబంధమా?పగ ! పాత కక్షలా కుట్రా?

### అనుమానాస్పదంలో వ్యక్తి మృతి,

### పోలీసులకు చాలెంజిగా మారిన వైనం.

**ఓబులవారిపల్లి మార్చి 20 రిపబ్లిక్ న్యూస్.**
అక్రమ సంబంధంమో పగో పాత కక్షల కుట్రో తెలియదు గానీ అనుమానాస్పదంలో కడప చెన్నై ప్రధాన జాతీయ రహదారి ఓబుల్ వారి పల్లి మండలం,రెడ్డిపల్లి చెరువు కట్ట నాయుడు డాబా మధ్య ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన ఘోర సంఘటన పోలీసులు చేదింపుకు చాలెంజిగా మారింది,వివరాల్లోకి వెళితే సుమారు 30 లేక 35 సంవత్సరాల మృతుడు నట్ట నడిరోడ్డుపై తల లేని మొండెం గా పడి ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉగాది రోజు తెల్లవారి జామున ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ నాయుడు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు,అయితే మృతుని గుర్తుపట్టేందుకు తల లేకపోవడంతో మొండెం చూసి గుర్తు పట్టలేని పరిస్థితి,దీనికి



తోడు శరీరంపై బట్టలు లేకుండా నగ్నంగా నడిరోడ్డుపై గుర్తు పట్టేందుకు వీలులేని విధంగా చేతులను, పాదాలను నుజ్జునుజ్జుగా తొక్కించి, కాళ్ల పైన శరీరం పైన కత్తిపోట్లు పొడిచినట్లు తెలు స్తోంది శవాన్ని గుర్తుపట్టేందుకు పోలీసులకు కూడా ఆచూకీ లభించే పరిస్థితి దొరకలేదు. దీనిని బట్టి చూస్తే అక్రమ సంబంధంతో జరిగిన పగ లేక పాత కక్షల కుట్రో,ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తో ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్త లేక ఇతర ప్రాంతాల్లో ఏదైనా గంజాయి బ్యాచ్చ, లేక కక్షలు, అక్రమ సంబంధాల పగలతో హత్య చేసి హతమార్చి తల ఉంటే కనుక్కుంటారని తల లేకుండా ఈ ప్రాంతంలో తెచ్చి పడేసారా! అన్నది తేలాల్సి ఉంది పోలీసుల చేదింపుకే దొరకని ఆచూకీ. అయితే ఈ మిస్టరీగా ఉన్న హత్య ఓబులవారిపల్లి పోలీసులకు చేదించేందుకు ఛాలెంజ్ గా మారినట్లు తెలుస్తుంది. అయితే ఎలాంటి అనుమానాలకు తగిన ఫిర్యాదులు లేకపోవడంతో పోలీసులు కూడా ఈ శవం ఎవరో మెంటల్ గా తిరిగే వ్యక్తిదేమోనని చెబుతున్నట్లు కూడా తెలుస్తుంది. అయితే ఈ మృతుడి శరీర భాగాలు చూస్తే మతిస్థిమితం లేని వాడిగా లేదని, ప్రమాదానికి గురి కాలేదని,ఏదో గొప్ప వ్యక్తి గానే చూసిన ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎస్సై మహేష్ నాయుడు శవాన్ని శవపరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిసింది

# అభిశంసనతో సాధించేదేమిటి?



న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) : సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్ధతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరిగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టు కునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండండతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేస్‌ప ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

## ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా

## భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు

## పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) : ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం

ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ఎ÷-లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# నేడు రంజాన్ సెలవు

## నేటి పదో తరగతి పరీక్ష ఎప్రిల్ 2కు వాయిదా

అమరావతి,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) : రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

------

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు



తిరుపతి,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) : చంద్రగిరి మండలం, ఎల్లంప్లలెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంప్లలె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

-----

# డాలర్‌తో రూపాయి మారకం 93.15 కు చేరిక




న్యూఢిల్లీ,మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్ ఆరంభంలో రికార్డు స్థాయిలో పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 93.15 వద్దకు చేరింది. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడం రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇక బ్రెంట్ క్రూడ్ ధర ప్రస్తుతం బ్యారెల్ 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు సుదీర్ఘకాలంపాటు కొనసాగుతాయన్న భయాలు బ్రెంట్ క్రూడ్ ధరలు పైకి ఎగబాకేలా చేస్తున్నాయి. చమురు ధరలు పెరిగే కొద్దీ డాలర్‌కు డిమాండ్‌కు పెరిగి రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపించాయి. గురువారం గ్లోబల్ మార్కెట్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో సూచీలు కుప్పకూలాయి. డాలర్‌పై పెట్టుబడులు పెరగడంతో అమెరికన్ కరెన్సీ మరింత బలపడింది. ఫలితంగా రూపాయి సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థాగత మదుపర్లు కూడా భారత్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరిగింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధానం కూడా ఈ పరిస్థితికి కొంత దోహదపడిందని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేటులో కోత పెట్టేందుకు సంకోచిస్తోంది. దీంతో, పెట్టుబడిదారులకు డాలర్ మరింత ఆకర్షణీయంగా మారి వర్ధమాన మార్కెట్స్ నుంచి నిధులు తరలి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

## అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు -గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు



టెహ్రాన్‌మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) : మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.

# కాలం చెల్లిన వాహనాలకు మరమ్మతులు

- మరమ్మత్తుల పేరుతో బిల్లులు వసూళ్లు
- అధిక మొత్తంలో డీజిల్ స్వాహా
- తప్పుడు లెక్కలతో ప్రజాధనం పక్కదారి
- అధికారుల నిర్లక్ష్యం ..పర్యవేక్షణ లోపం
- కార్పొరేషన్ కు నిధులు కేటాయింపు
- యదేచ్ఛగా నిధులు మాయం






**"రిపబ్లిక్" క్రైమ్, అనంతపురం జిల్లా**

కాలం చెల్లిన వాహనాలతో నగరంలో పనులు చేస్తున్న అధికారులు. పర్యవేక్షణ కొరవడి విచ్చలవిడిగా బిల్లులు దుర్వినియోగం నగరంలో ఎక్కడ చెత్త అక్కడే తరలించేవారు కరువయ్యారు. నగర జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించలేదు. దీంతో కార్మికుల కొరత కారణంగా నగరంలో చెత్త తరలింపుకు అటకం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాయి. నగరం అభివృద్ధి స్వచ్ఛతకు నిలయంగా ఉండాలని ఉద్దేశంతో ప్రతి ఏటా నిధులు కేటాయిస్తున్నా పక్కదారి పడుతున్నాయి. నగరంలో చెత్త మాత్రం గుట్టలు గుట్టలుగా పేరుకు పోతుంది. వాహనాలు మరమ్మతుకు చేరాయి. పాత వాహనాలతోనే పనులు చేస్తూ... విచ్చలవిడిగా డీజిల్ స్వాహా చేస్తూ.. తప్పుడు లెక్కలతో నిధులను మాయం చేస్తున్నారు.

## అధికారుల దాహానికి .. డీజిల్ సొమ్ము స్వాహా

అనంతపురం నగలపాలక సంస్థలో కాలం చెల్లిన వాహనాలతో అధికారులు పనులను చేస్తున్నారు. దీంతో అధిక మొత్తంలో డీజిల్ వృధా అవ్వడమే కాక.. వాటికయ్యే ఖర్చు మోయని భారం అవుతోంది. దీంతో అధికారులు డీజిల్ బిల్లులను అధిక మొత్తంలో దస్త్రాలలో చూపించి.. ఇష్టారాజంగా జేబులు నింపుకుంటున్నారు. దీంతో నగర ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకుండిపోయారు. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో నగర పాలక సంస్థలో నిధులు పక్కదారి పడుతున్నాయి. అక్రమార్కులు తమ జేబులను నింపుకుంటున్నారు.. వీటిపై అడిగే నాథుడే అనంతపురం నగరపాలక సంస్థలో కరువయ్యారు. దీంతో తగ్గేదేలే "పుష్ప".. అన్నట్లు .. డీజిల్ సొమ్మును స్వాహా చేస్తున్నారు. చేసిన పనులకు మాత్రమే డీజిల్ ఉపయోగించాలి. అలాకాకుండా చేయని వాటిని కూడా చేసినట్లు తమ లెక్కల్లో చూపి డీజిల్ బిల్లులు విచ్చలవిడిగా చేసుకుని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. పాత వాహనాలనే సాకుతో కొందరు అక్రమార్కులకు మాత్రమే డీజిల్ బిల్లులు ఆదాయ వనరులుగా మారాయి. పర్యవేక్షించాల్సిన అధికారులేమో నిద్ర మత్తు వదలకుండా ఉన్నారు. ఈ తంతు నగరపాలక సంస్థలలో యదేచ్ఛగా సాగుతోంది.

## మరమ్మతు కారణాలతో బిల్లులు వసూళ్లు

నగర జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించకపోవడంతో నగరంలో ఎక్కడ చెత్త అక్కడ గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. చెత్తను తరిదిలించేవారు లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ దుర్వాసన వస్తున్నప్పటికీ కూడా కార్మికులు మాత్రం సరిగా పనిచేయకపోవడం వీటికి అధికారుల నిర్లక్ష్యం కారణమవుతోంది. కార్మికుల కొరత కారణంగా నగరంలో చెత్త తరలించేందుకు ఆటంకం కలుగుతోంది. దీంతో వాహనాలు ఉన్నప్పటికీ కూడా మరమ్మతు కారణాలతో
బిల్లులను వసూళ్లు చేసుకుని అధిక మొత్తంలో జేబులు నింపుకుంటూ... తప్పుడు లెక్కలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వీటి పైన చర్యలు చేపట్టాల్సిన అధికారులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

## కార్మికులు పనిని ఎవరు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి

ప్రతి ఏటా నగరాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించినప్పటికీ కూడా స్వచ్ఛత దేవుడెరుగు.. స్వేచ్ఛగా జేబులు నింపేసుకుంటున్న కొందరు అధికారులు నగరపాలక సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వాహనాలు మరమ్మత్తు పేరుతో అధికారులు వాటి మీద
తప్పుడు లెక్కలతో డీజిల్ ని స్వాహా చేస్తున్నారు. నగరపాలక సంస్థలో నగర జనాభాకు తగ్గట్టు కార్మికులు లేకపోవడంతో నగర స్వచ్ఛత కుంటు పడిందనే చెప్పవచ్చు. పనివేళల్లో విధి నిర్వహణలో ఉండాల్సిన కార్మికులు కొందరు వారి బదులు వేరొక వ్యక్తులతో పని చేపిస్తున్నారు.

కార్మికుల సొంత ప్రయోజనాల కోసం అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వాళ్లకు ఇష్టం వచ్చినట్లు డ్యూటీలకు హాజరుకాకుండా వీరికి బదులుగా వీరికి అనుకూలమైన వ్యక్తులను డ్యూటీలకు పంపి.. డ్యూటీలకు హాజరైన ఈ వ్యక్తులకు కార్మికులు వారి వేతనాలలో నుంచి కొంత రోజువారి కూలి ఇచ్చి పనులు చేపించడం నగరపాలక సంస్థలలో ఏళ్ల తరబడి సాగుతోంది. ఇంత జరుగుతున్నప్పటికీ కూడా ఎవరు విధులలో ఎవరు పని చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నగరపాలక సంస్థలో నెలకొంది. వీటిపై నగర కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శానిటేషన్ అధికారులు పర్యవేక్షణ కొరవడి ఇష్టారాజ్యంగా విధులలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో కార్మికులు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు వ్యవహరిస్తుండడం గమనార్హం. అయితే అధికారుల పర్యవేక్షణ కొరబడడంతో నగరంలో కుప్పలు తిప్పలుగా చెత్త దుర్వాసన వస్తుంది. వీటికి అధికారుల సమన్వయ లోపమే కారణమని చెప్పకనే చెప్పవచ్చు.

## మరమ్మత్తు బిల్లులు వసూళ్లలో మాయాజాలం

కాలం చెల్లిన పాత వాహనాలతో చెత్త తరలించడంలో వాహనాలు ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి వల్ల కార్మికులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు.ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్ గడువు ముగిసినా, రిపేర్లు చేస్తూనే రోడ్లపై తిప్పుతున్నారు. కార్మికులు ఉపయోగించే వాహనాలు సగటు ఒక లీటర్ డీజిల్ తో కనీసం 10 నుంచి12 కిలోమీటర్ల మేరకు ప్రయాణం చేయాల్సి ఉంది. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఉండడంతో పారిశుద్ధ కార్మికుల ఉపయోగించే వాహనాలు అధికంగా డీజిల్ వృధా అవ్వడమే కాక రోజువారీగా లీటర్ల మేర తాగేస్తున్నాయి. కొన్ని వాహనాలు పదేపదే మరమ్మత్తులు చేయడంతో అవి మైలేజీ రాకపోవడంతో పాటు డీజిల్ అధికంగా ఖర్చవుతుంది. దీంతో అధికారులు చేసేదేమీ లేక తప్పుడు లెక్కలు రాసి దొంగ బిల్లులను చేసుకుంటున్నారు. అందులో భాగంగా నగర అభివృద్ధి కొరకు నిధులు కేటాయించినప్పటికీ కూడా నగర స్వచ్ఛతకు గండి కొట్టి కాసులకు కక్కుర్తి పడిన కొందరు అక్రమార్కులు లక్షలల రూపాయలను కొల్లగొట్టేస్తున్నారు. దీంతో ఆక్రమార్కుల ఆదాయ వనరులు నగరపాలక సంస్థలో రోజురోజుకు పెరుగుతూ ఉన్నాయని చెప్పవచ్చు. నగరాభివృద్ధికి పాటు పడాల్సిన అధికారులే లోపాయకారంగా ప్రజాధనాన్ని దోచుకు తింటున్నారు.

# ప్రతి గురువారం ఎముకలు, కీళ్ల ఉచిత ఓపిడి సేవలు

**: డాక్టర్ మహమ్మద్ రఫీ**

**విజయవంతంగా ముగిసిన నెల రోజుల ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం**

**నెల రోజులలో రెండు వేలకు పైగా రోగులకు ఉచిత ఓ పి డి చికిత్సలు అందించిన ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ మహమ్మద్ రఫీలి**

**. డాక్టర్ మహమ్మద్ రఫీ ని ఘనంగా సత్కరించిన ఐఎంఏ నంద్యాల**




**నంద్యాల మార్చి 20( రిపబ్లిక్ న్యూస్) :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ రంజాన్ మాసం పురస్కరించుకుని ఫిబ్రవరి నెల 18వ తేదీ నుండి ఈనెల 20 వ తేదీ వరకు నెల రోజులు పైగా పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జి.ఎస్.ఆర్. ఆస్పత్రిలో ఎముకలు కీళ్ల ,ఓపిడి సేవలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం జి.ఎస్.ఆర్. ఆస్పత్రిలో జరిగిన అభినందన కార్యక్రమంలో జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావులు డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ అరిఫా బాను దంపతులను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ గత నెల రోజులలో రెండు వేల మందిపైగా రోగులకు ఉచిత ఎముకలు, కీళ్ల ఓపిడి చికిత్సలు అందించడం జరిగిందన్నారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేశామని, 40 మందికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించామని తెలిపారు. చాలామంది పేదలు భవిష్యత్తులో తరచూ చూపించుకోవలసిన అవసరం ఉన్నవారు ఉండడంతో, ఇకపై ప్రతి గురువారం జి ఎస్ ఆర్ ఆస్పత్రిలో ఎముకలు ,కీళ్ల ఓపిడి చికిత్సలు ఉచితంగా అందరికీ అందిస్తామని ప్రకటించారు. ఇది నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ మహమ్మద్ రఫీ నెల రోజులపాటు ఉచితంగా ఓపిడి చికిత్సలు అందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి గురువారం నిరంతరంగా ఉచిత ఎముకలు, కీళ్ల ఓపిడి చికిత్సలు అందజేయడానికి ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ ఆర్ ఆసుపత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆరీఫా బాను,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావులు పాల్గొన్నారు.

# సహనం, ప్రేమ, దయ, సోదరభావం, పరోపకారం, సంతోషం ల కలయికే రంజాన్

**శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** సహనం, ప్రేమ, దయ, సోదరభావం, పరోపకారం, సంతోషం ల కలయికే రంజాన్ అని ఈ సుగుణాలన్నీ ప్రజలకు భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ ప్రజలకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం, నెలవంక అగుపించడంతో శనివారం దేశవ్యాప్తంగా రంజాన్ నిర్వహించుకుంటున్న సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి ఫరూక్ అమరావతిలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింల పవిత్ర గ్రంథం అయిన 'ఖురాన్' ఆవిర్భవించిన నెల రంజాన్ అని,ఈ నెలలో ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. నెలవంక కనిపించడంతో ప్రారంభమయ్యే రంజాన్ మాసం మళ్లీ నెలవంక వచ్చిన తర్వాతే ముగుస్తుందన్నారు.అల్లా ప్రజలందరి జీవితంలో ఆనందం నింపాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరుకుంటూ,జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్నీ అధిగమించే శక్తిని అల్లా ప్రసాదించాలని, సమానత్వాన్ని, సోదరభావాన్ని పెంపొందించి మానవత్వాన్ని మూర్తిభవింపచేయాలని ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలను మంత్రి ఫరూక్ తెలియజేశారు.

# నంద్యాలలో ప్రమోద్ గ్యాస్ట్రో, లివర్ కేంద్రం, వాణి కిడ్స్ ఆసుపత్రి ప్రారంభం

**నూతన ఆసుపత్రి ఏర్పాటుచేసిన జీర్ణకోశ, లివర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రమోద్ కుమార్ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవాణిలి**

**. ఆసుపత్రిని ప్రారంభించిన జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ**

**. చిన్నపిల్లల వైద్య విభాగాన్ని ప్రారంభించిన హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి**



**నంద్యాల మార్చి 20 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల పద్మావతి నగర్ స్టేడియం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రమోద్ గ్యాస్ట్రో లివర్ కేంద్రం,వాణి కిడ్స్ ఆసుపత్రి ని శుక్రవారం జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు.

మెడికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ, లివర్ సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రమోద్ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవాణి గతంలో శ్రీనివాస జూనియర్ కళాశాల నిర్వహించిన భవనంలో నూతనంగా ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల వైద్య విభాగాన్ని హైదరాబాద్ హైటెక్ సిటీలో ఉన్న స్త్రీ, శిశు మెడికవర్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి ప్రారంభించారు. వివిధ ఓపిడి,ఎండోస్కోపీ విభాగాలను నంద్యాల ఈమె మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,గ్యాస్ట్రో ఎంటరాలజీస్ట్ డాక్టర్ భార్గవరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి ,డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సునీత లు ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ రెడ్డి,డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో గ్యాస్ట్రో మరియు లివర్ సంబంధిత మెడికల్ చికిత్సలు ,చిన్నపిల్లల చికిత్సల కోసం అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు లు మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక మెడికల్ గ్యాస్ట్రో, లివర్ ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ఇదే ఆసుపత్రిలో చిన్న పిల్లల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇద్దరు వైద్యులు మంచి కళాశాలలో సూపర్ స్పెషాలిటీ వైద్యులుగా ఉత్తీర్ణులై, ఏఐజి మరియు మెడికవర్ ఆసుపత్రులలో పనిచేసి తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని నంద్యాలలో వైద్య సేవలు అందించడానికి రావడం ప్రశంసనీయమన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా నంద్యాల ప్రాంత ప్రజలకు మంచి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి , నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సునీత , ఉదయానంద గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ భార్గవరెడ్డి,డాక్టర్ వినోద్, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి ,డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# నంద్యాల మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతలు





**నంద్యాల క్రైం, మార్చి 20, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని నూనెపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా నంద్యాల మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్.ఈ గురప్ప యాదవ్, డీఈ పవన్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి తదితర సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నగర అభివృద్ధి దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటామని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలను మెరుగుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com